క్లుప్తంగా

24న మండల సర్వసభ్య సమావేశం

కాజులూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం కాజులూరులో ఈ నెల 24వ తేదీ నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఐ.రత్నరాజు తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఎంపీపీ మాత భారతి అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలపైనా సభ్యులు, అధికారులు చర్చిస్తారన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, స్థానిక సంస్థల ప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

రాష్ట్ర స్థాయి ప్రదర్శనలో విద్యార్థినుల ప్రతిభ



ప్రాజెక్టుతో పాటు విద్యార్థినులు, ఉపాధ్యాయుడు

కె.గంగవరం: అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్, జిజ్ఞాస ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్ ప్రాజెక్టుల్లో కె.గంగవరం ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. ఈ నెల 9, 10 తేదీల్లో ఆన్‌లైన్‌లో జూమ్ ద్వారా విజ్ఞాన శాస్త్ర ప్రాజెక్టుల ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో కె.గంగవరం ఉన్నత పాఠశాల విద్యార్థినులు డి.భార్గవి, ఓ.నాగమణి భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు పీవీ బ్రహ్మానందం మార్గదర్శకత్వంలో రూపొందించిన వీల్ చైర్ కమ్ స్ట్రెచర్ ప్రాజెక్టు పలువురి మన్ననలు పొందింది. ప్రత్యేక బహుమతితో పాటు రూ.వెయ్యి ప్రోత్సాహకాన్ని అందుకున్నారు.

సీఐగా దొరరాజు బాధ్యతల స్వీకరణ



సీఐ దొరరాజుకు అభినందనలు తెలుపుతున్న మురళి, ఇతరులు

రామచంద్రపురం: రామచంద్రపురం సీఐ పి.దొరరాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇప్పటివరకు సీసీఎస్ సీఐగా పనిచేస్తూ బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన సీఐ దుర్గారావు ఏలూరు వీఆర్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పిల్లి మురళి, వాడ్రేవు సాయిప్రసాద్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ఆయనను కలిసి అభినందనలు తెలిపారు.

క్రీడాకారుడికి సన్మానం



క్రీడాకారుడు వీరపవన్‌ను సత్కరిస్తున్న సభ్యులు

కాజులూరు: సమాజాభివృద్ధిలో యువకుల పాత్ర అభినందనీయమని జిల్లా బీసీ సంక్షేమ విశ్రాంత అధికారి సనపాల ధనరాజు అన్నారు. శుక్రవారం గొల్లపాలెంలో ఇంపేక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ కోకెనడా (కాకినాడ) ఆధ్వర్యంలో యువజన దినోత్సవ వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో భాగంగా సాఫ్ట్‌బాల్ పోటీల్లో జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించిన క్రీడాకారుడు డి.వీరపవన్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కరప, కాజులూరు మండలాల పెన్షనర్ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు దేవు సదానందమూర్తి, క్లబ్ అధ్యక్షుడు సీహెచ్‌వీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్టు



నిందితులు, మద్యం బాటిళ్లను చూపుతున్న సీఐ దొరరాజు

కె.గంగవరం: మండలంలోని కోట ఏటిగట్టుపై యానాం నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరిని రామచంద్రపురం సీఐ పి.దొరరాజు శుక్రవారం అరెస్టు చేశారు. కె.గంగవరం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు తెలిపారు. యానాం నుంచి అక్రమంగా ఇద్దరు వ్యక్తులు మోటారు సైకిల్‌పై మద్యం బాటిళ్లను తరలిస్తున్నారు. కోట గ్రామం వద్ద వీరిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి తొమ్మిది మద్యం బాటిళ్లను సీజ్ చేశారు. బాటిళ్లతో పాటు మద్యం తరలిస్తున్న మోటార్ సైకిల్‌ను సీజ్ చేసి, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీఐతో పాటు ఎస్సై జానీ భాషా ఉన్నారు.

వెదజల్లుకు సవాలు

- దాళ్వా సాగుకు కలుపు బెడద
- సకాలంలో నివారించకుంటే తీవ్ర నష్టం
- నిర్మూలనకు వ్యవసాయ నిపుణుల సూచనలే కీలకం



కాజులూరులో వెదజల్లిన వరి పొలంలో కలుపు నివారణకు రసాయన మందులను పిచికారీ చేస్తున్న రైతులు

కాజులూరు: తొలకరి పంట ఈ ఏడాది చివరి దశలో భారీ వర్షాలు కురిసి, మాసూళ్లు ఆలస్యమయ్యాయి. దీంతో దాళ్వా పంట దమ్ములకు, నారుమడులు, నాట్లు వేయడంలో తీవ్రజాప్యం జరిగింది. దీనికితోడు ఈ ఏడాది గోదావరి డెల్టా కాలువలకు మార్చి నెలాఖరు నాటికి సాగునీటి సరఫరా నిలుపుదల చేస్తామని నీటి పారుదల శాఖ అధికారులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో తక్కువ కాలంలో పంట దిగుబడికి వచ్చేలా రైతులు సాగు చేపట్టాలని, అందుకు వెదజల్లు విధానం శ్రేయస్కరమని వ్యవసాయ నిపుణులు సూచించటంతో.. రైతులు ఆ దిశగా పనుల్లో నిమగ్నమయ్యారు.

నియోజకవర్గంలో 52 వేల ఎకరాల్లో రైతులు ఈ ఏడాది దాళ్వా సాగు చేపట్టారు. కె.గంగవరం మండలంలో సుమారు 60 శాతం, రామచంద్రపురంలో 70, కాజులూరులో 85 శాతం రైతులు వెదజల్లు విధానాన్నే అవలంబిస్తున్నారు. సాధారణ పద్ధతి కంటే, వెదజల్లిన వరి పొలాల్లో కలుపు తీవ్రత ఎక్కువగా ఉంది. వరి మొక్కతో పాటు కలుపు మొక్క సమాంతరంగా పెరుగుతోంది. కలుపును సకాలంలో నివారించకుంటే, అవి ఎరువులను, భూమిలోని సహజ పోషకాలను గ్రహించి, క్రమేపీ వరి మొక్కలను అధిగమించి పెరుగుతాయి. నియోజకవర్గంలో వెదజల్లిన పొలాల్లో కలుపు తీవ్రత ఊహించిన దానికంటే ఎక్కువగానే ఉందని రైతులు చెబుతున్నారు. కొన్ని రకాల కలుపు మొక్కలను నివారించడం కష్టతరంగా ఉందంటున్నారు. తెలిసీ, తెలియని రసాయన మందులు వాడితే.. కలుపు మొక్కతో పాటు వరి మొక్కకూ నష్టం జరుగుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కలుపు నివారణకు సూచనలు

వెదజల్లిన పొలాల్లో వరిమొక్క బొడ్డు మొలవక ముందే కలుపు నివారణ సులభమని ఎంఏఓ అశోక్ పేర్కొన్నారు. విత్తనాలు చల్లిన మూడు రోజుల్లోగా పొలంలో నీరు తొలగించి, సాతి 120 గ్రా. మందును 200 లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరాలో పిచికారీ చేయాలి. మూడు నుంచి ఐదు రోజుల మధ్యలో స్టాప్‌స్టార్ 35 గ్రా. మందును అర లీటరు నీటిలో కలిపి, ఆ మందు ద్రావణాన్ని 20 కేజీల గోదావరి ఇసుకతో కలిపి ఎకరం పంటపై బురద పదునుపై చల్లుకోవాలి. 15 నుంచి 20 రోజులకు ఇంకా కలుపు ఉంటే, నామినీ గోల్డ్ మందు 100 మిల్లీలీటర్లను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. 15 రోజులు తర్వాత పొలంలో వుదా, జోడల గడ్డి వంటి వెడల్పాటి ఆకులు కలిగిన కలుపు మొక్కలు కనిపిస్తే, 2,4-డి సోడియం సాల్ట్ 500 గ్రా. 200 లీటర్ల నీటిలో కలిపి పొలంలో పిచికారీ చేయాలి. కలుపు మందులు పిచికారీ చేసేటప్పుడు పొలంలో పలుచటి నీటిపొర మాత్రమే ఉండాలి. పొలంలో నీరు నిలబడితే మొక్కలు చనిపోతాయి. వెదజల్లిన పొలాల్లో కలుపును సమర్థంగా నివారించి, తెగుళ్లను అధిగమిస్తే.. నాట్లు వేసిన పొలం కంటే ఎకరాకు ఐదు నుంచి పది బస్తాలు ఎక్కువ దిగుబడి సాధించవచ్చు.



కాజులూరులో కలుపు తొలగించి, వెదజల్లిన వరి పొలం

సమస్యాత్మకంగా మారింది



వర్షాల కారణంగా దాళ్వా సాగుకు తీవ్ర జాప్యం జరిగింది. దీంతో తక్కువ రోజుల్లో పంట దిగుబడికి వచ్చేలా సాగు చేపట్టాలన్న అధికారుల సూచనల మేరకు వెదజల్లు విధానానికి ప్రాధాన్యమిచ్చాం. వెదజల్లిన పొలాల్లో కలుపు తీవ్రత సమస్యాత్మకంగా మారింది.

– మాత సూకరావు, రైతు, దుగ్గుదుర్రు

కలుపు తీవ్రత అధికంగా ఉంది



వెదజల్లిన పొలాల్లో కలుపు తీవ్రత చాలా ఎక్కువగా ఉంది. కొన్ని రకాల కలుపు మొక్కలు రసాయన మందులకు నశించడం లేదు. వాటిని సకాలంలో తొలగించకుంటే, దట్టంగా పెరిగి పొలంలో కలుపుతీతకు కూలీల ఖర్చు అధికమవుతుంది.

– మట్టా సత్యనారాయణ, రైతు, గొల్లపాలెం

సకాలంలో వాడాలి



వెదజల్లిన పొలాల్లో రైతులు కలుపు నివారణకు రసాయన మందులను నిర్ణయించిన మోతాదులో సకాలంలో వాడాలి. వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తే, పొలాల్లో కలుపు నివారణ సులభమవుతుంది. దీనివల్ల దిగుబడి కూడా మరింత పెరుగుతుంది.

– వి.అశోక్, ఎంఏఓ, కాజులూరు మండలం

రేషన్ బియ్యం పట్టివేత

రాయవరం: అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు రాయవరం ఎస్సై జి.నరేష్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మాచవరం గ్రామానికి చెందిన షేక్ బషీర్ రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నాడు. మాచవరం నుంచి బిక్కవోలు గ్రామ పరిసరాల్లో ఇటుకల బట్టీల్లో ఉండే కూలీలకు విక్రయిస్తున్నాడు. కిలో రూ.15కు కొనుగోలు చేసి, రూ.19కి విక్రయిస్తున్నాడని, అలా అమ్మేందుకు 50 కేజీల బస్తాలు 60 తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్టు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

పేకాట శిబిరంపై దాడి

రాయవరం: గ్రామంలో పేకాట ఆడుతున్న వ్యక్తులపై దాడి చేసినట్టు ఎస్సై నరేష్ తెలిపారు. నలుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్టు వచ్చిన సమాచారంపై దాడి చేసి, వారి వద్ద నుంచి రూ.1,010 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

పాత కార్యకర్తలకు కొత్తగా కండువాలా?

కపిలేశ్వరపురం: మండలంలోని తాతపూడి గ్రామంలో అప్పటికే టీడీపీలో తిరుగుతున్న వారికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలో చేరినట్టు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందని వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు గూటం సత్యనారాయణ శుక్రవారం అన్నారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సమక్షంలో ఇటీవల పార్టీలో చేరారంటూ చెబుతున్న తమ గ్రామానికి చెందిన వ్యక్తి.. ఎప్పటి నుంచో టీడీపీలో తిరుగుతున్నారన్నారు. వైఎస్సార్ సీపీకి గ్రామం పట్టుకొమ్మ అన్నారు.

ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి

రామచంద్రపురం రూరల్: పేద ప్రజల ఆరోగ్యం కోసం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ అంబటి భవాని అన్నారు. చోడవరం గ్రామ సచివాలయంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథి ఎంపీపీ భవాని శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. సర్పంచ్ నేదూరి సంతోషమ్మ సభకు అధ్యక్షత వహించారు. మాలపాడు సర్పంచ్ సృజన ప్రియాంక, ఎంపీటీసీ సాదే సుభద్రమ్మ, ఉప సర్పంచ్ వైట్ల అన్నపూర్ణ శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ ఎన్ ప్రశాంతి మాట్లాడుతూ ఈ శిబిరంలో 352 మందికి పరీక్షలు నిర్వహించినట్టు తెలిపారు. వీరిలో 29 మంది నేత్ర చికిత్స చేయించుకున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు అలేఖ్య, బి సౌమ్య, జి సుశీల వైద్య సేవలందించారు. ఈఓపీఆర్డీ సెలెట్ రాజు, డివిజినల్ సూపర్‌వైజర్ జి.కమల్ శేషు, డీపీఎంఓ ఎం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎంపీపీ భవాని

వాహనదారులపై కేసులు

అమలాపురం టౌన్: అమలాపురంలో మోటారు సైకిళ్ల సైలెన్సర్లు తీసేసి భయంకరమైన ధ్వనులతో ప్రజలకు అసౌకర్యం కలిగించిన 11 మంది యువకులపై కేసులు నమోదు చేసి, వాహనాలను స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ తెలిపారు. అమలాపురంలో శుక్రవారం తెల్లవారుజాము నుంచి ఉదయం వరకూ సైలెన్సర్లు తీసేసిన మోటారు సైకిళ్లపై ప్రమాదకరమైన విన్యాసాలు చేస్తూ భారీ శబ్దాలతో సాధారణ ప్రజలకు ఇబ్బంది కలిగించారని చెప్పారు. రోడ్లపై ప్రమాదకర పరిస్థితుల్లో రైడింగ్ చేశారన్నారు. పట్టణ సీఐ టి.క్రాంతి కుమార్, పట్టణ ఎస్సైల ఆధ్వర్యంలో 11 మందిపై కేసులు నమోదు చేశామని డీఎస్పీ అంబికా ప్రసాద్ వివరించారు.

మాటను నిలబెట్టుకునే నాయకుడు జగన్

వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ సూర్యప్రకాశ్

రామచంద్రపురం: చెప్పిందే చేస్తాను, నేను ఉన్నాను, నేను విన్నాను.. అని పాదయాత్రతో భరోసాను కల్పించి, నవరత్న పథకాల ద్వారా చెప్పిందే చేసి చూపించిన నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. పట్టణంలోని ప్రసన్న విఘ్నేశ్వర ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం కాజులూరు మండల వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యతిథులుగా ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఎమ్మెల్సీ కుడిపూడి సూర్యనారాయణరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూర్యప్రకాశ్ మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి కానీ, ఏ నాయకుడు కానీ చేయని విధంగా ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందించి, మా పథకాలు అందాయా అని ఇంటింటికీ వెళ్లి అడిగి తెలుసుకునే దమ్మున్న నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. నవరత్న పథకాల్లో 98 శాతం అమలు జరిపిన ఘన చరిత్ర వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలనే జలగలు.. ప్రజల వద్ద నుంచి పీల్చుకుని తింటే, ప్రస్తుతం జగనన్న ప్రభుత్వం కులమతాలు, పార్టీలు ఇవేమీ చూడకుండా, అర్హత ఉంటే చాలు ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్ధిదారుని ఖాతాలో జమచేస్తున్నారని వివరించారు. గతంలో వర్గాలు, కులాల పేరుతో చంద్రబాబునాయుడు విడదీసి కుమ్ములాటలు పెడితే, ప్రస్తుత ముఖ్యమంత్రి నా బీసీలు, నా ఎస్సీలు, నా మైనార్టీలంటూ వారి కష్టాలను తీర్చుతూ అక్కున చేర్చుకుంటున్నారన్నారు. పేదల పక్షపాతిగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని త్వరలో జరగబోయే ఎన్నికల్లో తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం మనందరిపైనా ఉందని కార్యకర్తలకు, నాయకులకు సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, జెడ్పీటీసీ వనుం వెంకట సుబ్బారావు, ఎంపీపీ మాతా భారతి, వైస్ ఎంపీపీలు పెద్దిరెడ్డి వెంకటరమణ, రేఖాడ విజయ, పార్టీ నేతలు కొప్పుల సత్యనారాయణ, పోలినాటి సూర్యచంద్రం, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పీఏసీఎస్ చైర్మన్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న సూర్యప్రకాశ్

యువతకు స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద

కాజులూరు: ప్రపంచంలోని మానవ వనరులను ముందుగా గుర్తించి, యువతను మేల్కొపిన స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద అని కాకినాడ జిల్లా సమరసత సంయోజక్ డాక్టర్ శీలామంతుల వీరభద్రరావు అన్నారు. శుక్రవారం గొల్లపాలెంలో సమరసత వేదిక ఆధ్వర్యంలో జరిగిన స్వామి వివేకానంద జయంతి వేడుకలో ఆయన పాల్గొన్నారు. యువతరం స్వామి వివేకానందుడిని ఆదర్శంగా తీసుకుని, ముందుకు సాగాలన్నారు. దేశ మహోన్నత్యాన్ని, సనాతన ధర్మ వైభవాన్ని ప్రపంచ దేశాలకు చాటిచెప్పిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. దుగ్గుదుర్రులో అమలాపురం శెట్టిబలిజ సంక్షేమ సంఘం కన్వీనర్ కడలి రాంపండు ఆధ్వర్యంలోనూ నాయకులు స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు.



గొల్లపాలెంలో స్వామి వివేకానంద చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

వివేకానందుడి జీవితం ఆదర్శప్రాయం

రాయవరం: మండలంలోని పసలపూడిలో శుక్రవారం స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీనగర్‌లో ఉన్న స్వామి వివేకానంద విగ్రహానికి శ్రీనగర్ అధినేత తాడి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వివేకానందుని జీవితం ప్రతిఒక్కరికీ ఆదర్శప్రాయమన్నారు. కార్యక్రమంలోమండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ప్రగతి రామారెడ్డి, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు చింతా సుబ్బారెడ్డి, స్థానిక నేతలు కె.సుధాకర్‌రెడ్డి, సత్తి గంగాధరరెడ్డి, కె.భరత్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పసలపూడిలో వివేకానందుని విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

కోడి పందేలకు స్థలాలిస్తే చర్యలు

కపిలేశ్వరపురం: సంక్రాంతి నేపథ్యంలో కోడి పందేలకు స్థలాలిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని తహసీల్దార్ కొమరం సూర్యారావు హెచ్చరించారు. కపిలేశ్వరపురంలో శుక్రవారం గతంలో కోడి పందేలు ఆడిన ప్రదేశాలను సందర్శించి, సంబంధిత రైతులకు అవగాహన కల్పించారు. కోడి పందేలు, గుండాట, జూదం నిషేధమని, ఆడిన వారిపై చర్యలు తీసుకుంటామంటూ ఫ్లెక్సీలను కట్టారు. పందేలు ఆడేవారిపై చర్యలు తీసుకోవాలంటూ అంగర ఎస్సై జి.చంటిని ఆదేశించారు.

కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు

కె.గంగవరం: పోలీసుల ఆదేశాలను బేఖాతరు చేసి కోడిపందేలు నిర్వహిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని కె.గంగవరం ఎస్సై జానీ బాషా శుక్రవారం హెచ్చరించారు.



కపిలేశ్వరపురంలో అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

ఇప్పటికే పల్లె ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. సంప్రదాయ క్రీడలకు ప్రాధాన్యమివ్వాలని సూచించినట్టు చెప్పారు. తమ మాటను బేఖాతరు చేసి, పందేలు నిర్వహిస్తే తాటతీస్తామని హెచ్చరించారు.

అందంగా మెరిసి.. మైమరపించి..

- రంగవల్లులతో నిండుతున్న లోగిళ్లు
- సాంకేతికను వినియోగిస్తున్న వైనం
- సృజనాత్మకతకు వేదికగా ముగ్గుల అద్దకం

కపిలేశ్వరపురం: రంగవల్లులంటే మహిళలకు మక్కువ. ముగ్గులు అద్దేందుకు పండగ సమయాన్ని దండిగా వినియోగిస్తుంటారు. ముగ్గులు నయనానందాన్నే కాదు, వాటిని అద్దే ప్రక్రియ వెనుక శాస్త్రీయ కోణాలనేకం ఉన్నాయి. గత కాలానికి చెందిన సంక్రాంతి కళలు ఎన్ని కనుమరుగైనా, ముగ్గుపై ఆసక్తి నేటికీ కొనసాగుతోంది. ఆధునిక మహిళ అందుకు సాంకేతికతను సైతం వినియోగిస్తోంది. సంక్రాంతి నేపథ్యంలో సంస్కృతి, సంప్రదాయాలకు నిలయమైన రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో ముగ్గుల లోగిళ్ల తీరుతెన్నులపై ఈ కథనం.

ముగ్గుల నేపథ్యమిదీ..

ధనుర్మాస ఆరంభ దినమైన నెల పొడుపున ప్రారంభమై భోగి రోజున రథం ఆకృతిలో ముగ్గును అద్దడంతో సంక్రాంతి సంబరాలు ముగియనున్నాయి. ఇంటి ముందు ముగ్గు వేసి, గొబ్బెమ్మలను అమర్చి, పూజలు చేయడం ద్వారా పెళ్లీడు అమ్మాయిలకు మంచి వరుడు వస్తాడని ఆండాళ్ తల్లి పావన చరిత ద్వారా తెలుస్తోంది. భోగి రోజున గొబ్బెమ్మ ముగ్గు, సంక్రాంతికి పూర్ణ కుంభం, కనుమకు రథం ముగ్గు వేయడం ఆనవాయితీగా వస్తోంది.

మగువల అనుబంధాల ముగ్గు

తల్లీ, కూతుళ్లు ఎక్కడ మొత్తుకున్నా ముగ్గు పెట్టే చోట మాత్రం చిన్న పిల్లలైపోతారు. ముగ్గు అద్దుతూ.. సృజనాత్మక, కళానైపుణ్యంతో చర్చలు జరుపుతారు. అంతిమంగా వారి మధ్య ప్రేమానుబంధాలు పెరుగుతాయి. కులం, మతం, ప్రాంతం భావనలకు చోటు లేని ముగ్గు సమీప నివాసితులతో సైతం అనుబంధాలను పెంచుతుంది.





ముగ్గులు అద్దే వేదికలివే..

రెండు నియోజకవర్గాల్లో 170 గ్రామాలు పచ్చని పొలాలతో సంక్రాంతి కళకు నిలయంగా ఉంటాయి. ఇంటి రహదారి మట్టిదైతే ముగ్గు పౌడర్‌లతోనూ, సీసీ రోడ్డు అయితే పెయింట్, బ్రష్‌తోనూ ముగ్గులేస్తున్నారు. ఇంటి ప్రధాన ద్వారాల వద్ద సంక్రాంతి శుభాకాంక్షలు, స్వాగతం చెబుతూ రంగురంగుల ముగ్గులనద్దుతున్నారు. మండపేట, రామచంద్రపురం మున్సిపాలిటీ ప్రాంతాల్లో ఇంటి ఆవరణలు అంతంత మాత్రమే కావడంతో, మెట్లు, హాలుల్లో రకరకాల డిజైన్ల ముగ్గులతో ఉన్న స్టిక్కర్లను అతికిస్తున్నారు.

సంస్కృతికి సాంకేతికత తోడు

చేతి వేళ్ల మధ్యల్లోంచి ముగ్గును జార విడుస్తూ వేసే పద్ధతి సాధారణమైంది. ముగ్గులు అద్దడంలో మహిళలు సాంకేతికతను వినియోగిస్తున్నారు. ప్రచార మాధ్యమాలతో పాటు ఇంటర్నెట్‌లో పలు మోడళ్లను డౌన్‌లోడ్ చేసుకుని, ముగ్గులను అద్ది మురిసిపోతున్నారు. తమ ముగ్గులను చుక్కలు, మెలికలు, డిజైన్లు, హాస్యం బొమ్మలు, కూరగాయలు, దేవతా మూర్తులు, సంగీత సాధనాలతో నింపుతున్నారు. ముగ్గు, రంగు పౌడర్లు, పెయింట్లు . బ్రష్‌లు, జల్లెడ ముగ్గు, డబ్బా ముగ్గులు, అచ్చు, మెట్లపై స్టిక్కర్లు, మొత్తం 12 రకాల రంగులు కొనుగోలు చేస్తున్నారు.

సంస్కృతి, సైన్స్ మేళవింపు

ముగ్గులు వేసే ప్రక్రియలో అనేక శాస్త్రీయ అంశాలున్నాయి. వాకిట్లో ముగ్గులు అద్దితే చాలు గంట సేపు వ్యాయామం చేసిన శ్రమకు సమానం. చుక్కల ముగ్గులు ద్రవిడ సంప్రదాయంగా, గీతల ముగ్గు ఆర్య సంప్రదాయంగా పరిగణిస్తారు. బియ్యపు పిండితో ముగ్గులు వేయడం ద్వారా పురుగు, పుట్రాలకు ఆహారం వేయడమే భావన కూడా ఉంది. వీధిలో పొడవాటి ముగ్గు వేయడం ద్వారా సూర్య కాంతి ప్రభావంతో ముగ్గుపై పడే ఇంటి నీడను బట్టి సమయాన్ని లెక్కించేవారు.

ముగ్గులతో జ్ఞాన సముపార్జన

అక్షరానికి ముందు ఆకృతిలే విజ్ఞానానికి తార్కాణంగా ఉండేవి. ప్రస్తుత లిపి స్థానంలో ప్రకృతి ప్రసాదితమైన కొమ్మా, రెమ్మా, పక్షులు, మృగాలు, పురాణ గాథల ఘట్టాలను ముగ్గుల్లో వేసి అవగాహన పెంచేవారు. మానవ సంబంధాలను తెలిపే ఆకృతులే ఆనాడు అమలులో ఉండేవి. చుక్కలను కలిపే నేర్పులో గణితం ఇమిడి ఉంటుంది. ముగ్గు విస్తరణను సరిచేయడంతో పొడవు, వెడల్పుల భౌతిక శాస్త్రం ఉంది. రంగవల్లులలో రంగులతో రసాయన శాస్త్రం కనిపిస్తుంది. మొత్తంగా చెప్పాలంటే ముగ్గు మనకో తాత్విక దృక్పథాన్ని తెలియజేస్తుంది.

పోటీల్లో పాల్గొంటాను



ముగ్గులంటే ప్రాణం. అంగరలో ఏటా పలు సంస్థలు ముగ్గుల పోటీలను నిర్వహిస్తుంటారు. వాటిలో నేను, నా స్నేహితులం పాల్గొంటాం. ఎవరు గెలిచినా ఆనందం అందరిదీ అన్న భావనలో సంబరపడతాం.

– సంకాబత్తుల వెంకటలక్ష్మి, అంగర

జ్ఞాపకాలే మెదలుతాయి



అంగరకు చెందిన నేను హైదరాబాద్‌లో స్థిరపడ్డాను. ధనుర్మాసంలో ధ్యాస అంతా సొంతూరు అంగరలోని ముగ్గుల సందడిపైనే ఉంటుంది. భారతీయ సంస్కృతి, సంప్రదాయల గొప్పతనం ఎన్నటికీ అంతరించదు.

– శనివారపు కుమారి

సంప్రదాయాలు ప్రతిబింబించే సంక్రాంతి : కలెక్టర్



కలెక్టరేట్‌లో సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, అధికారులు

అమలాపురం రూరల్: తెలుగు సంప్రదాయాలు సంక్రాంతి పండగలో ప్రతిబింబిస్తాయని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. ముందస్తు సంక్రాంతి సంబరాలు అమలాపురం కలెక్టరేట్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భోగి మంటలు, గొబ్బిళ్లు, రంగవల్లులు, హరిదాసులు, పిండివంటలు ఇలా ఎన్నెన్నో కలసి ఒకే చోట సందడి చేసే పండగ సంక్రాంతి అన్నారు. సంస్కృతీ సంప్రదాయాలకు నిలువుటద్దంగా జరుపుకునే అతిపెద్ద పండగ సంక్రాంతి అన్నారు. నేటి తరానికి విద్యతో పాటు మన సంస్కృతి సంప్రదాయాలను వారసత్వంగా అందించా లన్నారు. ఈ సందర్భంగా ఆయన ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి వేడుకలను పల్లెటూరి వాతావరణంలో కన్నుల పండువగా నిర్వహించుకోవాలని సూచించారు. సిబ్బందితో కలిసి గాలిపటాలు ఎగురవేశారు. జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, కలెక్టరేట్ పరిపాలనాధికారి కాశీ విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.